# రాణి-కాత్యాయని

కాత్యాయినికి ఇంకో రెండు రోజుల్లో ఇంటి పేరు మారిపోతుంది. గోత్రం మారిపోతుంది. ఇల్లు... ఇల్లేమిటి ఊరే మారిపోతుంది. ఒకవైపు బెంగగా వున్నా శేఖర్‌తో జీవితం పంచుకోబోతున్నందుకు ఎన్నెన్ని కలలో... ఆ కలతని కప్పెటి పగలూ రాత్రీ, తేడా లేకుండా కుదిపేస్తున్నాయి. అక్కయ్యలూ, బావలూ అన్నా వదినా మరికొందరు దగ్గర చుట్టాలూ వచ్చేశారు. ఇన్నాళ్లూ పెళ్లికింత ఆర్భాటం దేనికి అని ఆదర్శోపన్యాసాలు చేసిన తనకే ఇప్పుడూ ఇంటిల్లిపాదీ కలిసి హడావుడి పడుతూ చేస్తున్న ఏర్పాట్లు చాలవేమో అనిపిస్తోంది.

ఇంటి పక్క కమల, క్లాస్‌మేట్ సరళ... రెండు రోజుల్నించి పెళ్లి కూతురు తోనే ఉండి గోరింటాకు డిజైను ఏంటి... వధూవరుల మధ్య

పెట్టాల్సిన తెర ఎలా ఉండాలీ అని ప్లాన్ చేస్తున్నారు. మధ్య మధ్యలో పెద్దాళ్లు మగాళ్లూ వినకూడని జోకులు వేసి వాళ్లే నవ్వేస్తున్నారు. తను సిగ్గుతో వాళ్లని గిల్లేస్తోంది.

"ఇలా గిచ్చావనుకో... ఆయనగారు గదిలోంచి బైటికొచ్చి పబ్లిగ్గా ఈ శూర్పణఖ నాకొద్దు బాబోయ్... అని కాలి నడకన కాకినాడ పారిపోతాడు"

"ఏమేవ్... ఆయన పారిపోతుంటే... నేను అడ్డెళ్లి ఆపుతాను" కమల అంది.

"అమ్మ ఆశ... శేఖర్ ముందు దండతో నించునేలా వుందేవ్... కమ్మ్మ" అంది సరళ.

పదోసారి పట్టుచీరలు చూపించటం... చూడటం...

ఇరవయ్యోసారి అతనికి పెట్టే బట్టలు చూపించటం... చూసుకోవడం... హడావుడి!

ఇదెప్పుడు కట్టుకోవాలో... అదెప్పుడు కట్టుకోవాలో నిర్ణయించుకోవటం-

రాత్రి కట్టుకునే చీరమీద జోకులూ... కోలాహలంగా కాత్యాయిని కలలకి కలర్స్ వేస్తున్నారు స్నేహితురాళ్లు...

మధ్య మధ్యలో భోజనాలు టైములో... చుట్టాలతో మీటింగ్, వాళ్లు చేస్తున్న పనులు ఓ కంట పర్యవేక్షణ...

ఇంకెంత రెండు రోజులు... ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూసే జూలై **4** వస్తుంది. దడ దడా వెళ్లిపోతుంది. ఆ తర్వాత నుంచి చకచకా

వెళ్లిపోయే రోజులొస్తాయి. శేఖర్ కూడా ఇలాగే అనుకుంటాడా... ఇంకా ఇంకా ఎక్కువే అనుకుంటాడు- పెళ్ళి చూపులప్పుడు తను సిగ్గుతో కళ్లెత్తి చూడలేకపోతుంటే... అతను చూపుల్తో రెచ్చకొట్టి... రెప్పలు ఎత్తించాడు. ఆ కళ్లలో... ఆ చూపుల్లో ఏదో గొప్ప కాంతి వుంది- మగాళ్ల కళ్లు కూడా అందంగా ఉంటాయని తనకి అప్పుడనిపించింది.

చుట్టూ కాటిక మెత్తి... ఇంత కళ్లని... అంతగా చూపిస్తారు ఆడాళ్లు. అతనివి కాటుక పెట్టుకోకపోయినా... ఇంతింత కళ్లు- ఆ చూపుల్లో కళతోబాటు... ధైర్యం, చిలిపితనం- కన్నుకొట్టేస్తాడేమో కూడానూ అని గబుక్కున కళ్లు దించుకుంది. ఆ చూపుల్లో చూపు కలపలేకపోయింది... శేఖర్... మై డార్లింగ్... ఎన్నిసార్లు అనుకుందో.

✦ ✦ ✦

శేఖర్‌కి ఈ పెళ్లి తప్పించుకోవటానికి కారణాలు కావాలి. రకరకాల ప్లాన్లు వేస్తున్నాడు.

అమ్మా నాన్న మెడొంచి పెళ్లి చూపులు ఏర్పాటు చేశారు- చస్తామని బెదిరించి పెళ్లి కొప్పించారు. కాత్యాయిని నిజానికి బాగానే వుంటుంది.

కానీ... రాణి?

రెండ్రోజుల్లో... ఇటో అటో... తేల్చుకోవాలి.

రాణి వాళ్ల అన్నయ్య నేనీ పెళ్లి తప్పించుకోకపోతే ఖచ్చితంగా చంపేస్తాడు... 'మర్డర్ చెయ్యడం ఖాయం' అని హెచ్చరించాడు.

తను రాణిని ప్రేమించాడు... ఆమె ప్రేమని పొందడంతో గర్వించాడు. కానీ... ఇప్పుడు.. ఆ ప్రేమ పీకపట్టుకుంది. ఆత్రంగా ఆవేశంగా రాణీవాళ్ల అన్నయ్యతో కూడా విషయం చెప్పేశాడు. అతను బ్రహ్మానంద

పడిపోయాడు. ఇప్పుడు బ్రహ్మరాక్షసుడిలా మారిపోయాడు. ఇంటికొచ్చి గొడవ చేయబోతుంటే... "వద్దు.. అమ్మానాన్నకి ఈ విషయం తెలియకూడదు... నాన్నకి రెండు సార్లు హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆయన కేవన్నా అయితే బర్డెన్ అంతా నామీద పడుతుంది. అప్పుడు మీ చెల్లాయిని పెళ్లాడ్డానికే కాదు పలకరించడానికి కూడా కుదరదు" హెచ్చరికో బతిమాలడమో తెలియకుండా ఇంటికి రాకుండా... ఆపగలిగాడు... కానీ ఈ గండం గడిచేలా మనసులో రకరకాల కుళ్లు అయిడియాలు వేస్తున్నాడు. మనిషికి ప్రాణం ముఖ్యమా... పరువు ముఖ్యమా?

+ + +

ప్రాణంకన్నా పరువు ముఖ్యం- పరువు పోయాక ప్రాణం నిలబెట్టుకోవల్సిన పనిలేదని కాత్యాయిని కుప్పకూలిపోయి ఏడిచింది.

విడిదిలో పెళ్లి వారు దిగిన కాస్సేపటికి పిడుగులాంటి వార్త.... పెళ్లికొడుకు ఫ్రెండ్ వస్తూ వస్తూ వాళ్ల ఊరినించి తెచ్చిన టెలిగ్రాం గ్రీటింగ్స్‌తో బాటు ఇచ్చిన ఇన్‌లాండ్ కవరు-

దాన్ని పెళ్లికొడుకు తండ్రి చూశాడు. ఉగ్రుడైపోయాడు. ఆడపెళ్లి వాళ్ల మీద- దుర్వాస వీరంగం చేశాడు... పెళ్లి మండపం... దక్ష యజ్ఞ వాటికైంది. మగపెళ్లి వాళ్లలో మగాళ్లంతా వీరభద్ర బీభత్సం చేశారు.

ఆ ఇన్‌లాండ్ లెటరు... కాత్యాయిని కలల్ని కాల్చేసింది.

ఆమె కేరక్టరు మీద పుకార్లు పుట్టించి మంట రాజేసింది. అది రాసిన వాడెవడో ఏ సాక్ష్యాధారాల్తో ఆ లెటర్ రాశాడో... ఎందుకు రాశాడో ఆమెకే కాదు రాసినవాడికే తెలీదు... శక్తివంతమైన అక్షరాల్తో ఒక కన్నె

బతుకుని శపించాడు. ఎదురు నిలబడి ఆ వీరభద్రుల్ని అణచివేసే శక్తి ఈ కాత్యాయినికి లేదు... ఆ పరిస్థితిలో ఆమె చేయాల్సినది దేహత్యాగమే అనుకుందేమో!

అవమానం భరించలేని వాళ్లకి పార్వతి చూపిన దారి అదేనా? గది తలుపేసుకుని సీసా మూత తీసి మృత్యువుని మింగింది.

ఇల్లు కల్లోలం అయిపోయింది.

తలుపులు బద్దలౌతున్నాయి.

✦ ✦ ✦

పెళ్లి కొడుకు విడిదింట్లో స్పష్టాస్పష్ట దైన్యస్థితిలో మహా యాతన పడుతున్నాడు. కాత్యాయినిది ధైర్యం... అయితే... శేఖర్‌ది పిరికితనం.

కాత్యాయినిది చావుకైనా ఎదురెళ్లే స్థైర్యం... శేఖర్‌ది తన నీడనైనా చూడలేని భయం...

అతను కూడా తలుపులు గడియపెట్టుకుని ఒంటరిగా ఉన్నాడు- బైట బాది బాదిన తలుపులు... నడ్డి విరిగి తూలిపడ్తూ భళ్లున విరిగిపడ్డాయి.

జనం అందరూ లోపలికి రాబోయారు-

"ఆగండి... ఎవ్వరూ లోపలికి రానక్కర్లేదు... మీ అందరిదీ తలో నాలిక... తలో తలా... తలకో చుట్టరికం... స్నేహం. ఇలాంటి వాడికి.. మీ అభిప్రాయాలు బతకాలన్న ఆశనిస్తాయి... వెళ్లండి!" అంటూ శివమెత్తిన భద్రకాళిలా... హెచ్చరించి అందర్నీ ఆపేసిన ఆ గొంతు... రాణిది!

ఆ గొంతుకు భయపడి అందరూ గది బైటే నిలబడిపోయారు.

ఆమె శేఖర్ దగ్గరకొచ్చింది...

కళ్లల్లో అగ్నిగోళాలు మండుతున్నాయి.

చూస్తుండగా చేతిలోకి తన కాలి చెప్పు దూకింది.

మరుక్షణం అతని చెంపల మీద చెప్పు తాండవం చేసింది.

రాణి అన్నయ్య... చెల్లెలు చేస్తున్న అఘాయిత్యాన్ని ఆపడానికి దూసుకొచ్చాడు.

"అన్నయ్యా... నన్నాపకు... ఆ పెళ్లి చేసుకుంటే తన ప్రాణానికి ముప్పు అని ఈ రాక్షసుడు ఆవిడ ప్రాణం తీస్తున్నాడు... ఇలాంటి ఆకాశ రామన్నగాడు... బతక్కూడదు. బతికినా... నేను వీణ్ని పెళ్లి చేసుకోను... నేనే కాదు ఏ ఆడపిల్లా వీణ్ని పెళ్లి చేసుకోకుండా బతికున్నంతకాలం ప్రయత్నిస్తా! ఇలాంటి నరంలేని వాళ్లని నపుంసకులు అనాలి. అలాంటి వాళ్లని అలాగే చావనియ్యాలి. కాత్యాయిని గారికి ప్రాణం నిలచిందా పోరాటం మా ఇద్దరిదీ. ఆమె చనిపోతే... వీడి ప్రాణం పోయేదాకా నా పోరాటం ఆగదు."

రాణి... రుద్రమ్మె... రాణీ రుద్రమ్మె చండశాసనం చేసింది. స్పృహ పోతున్న శేఖర్‌ని ఈడ్చికెళ్లి చనిపోయిన కాత్యాయిని కాళ్ల మీద పడేసింది.

ఆ తర్వాత కథ అందరూ ఊహించుకోవచ్చు.

కాత్యాయిని ఆవహించిన... రాణి ఏ మహిళకి అన్యాయం జరిగిందని తెలిసినా... ఉద్యమ స్ఫూర్తితో విజృంభిస్తోంది... ఇప్పుడు ఆమె వెనక ఎన్నో మహిళా సంఘాలు! ఆమెది మాత్రం... కాత్యాయినీ మహిళా సంక్షేమ సంఘం.